క్లుప్తంగా

బహిరంగ సభను విజయవంతం చేయాలి

అశ్వాపురం: ఈ నెల 18న ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభతో దేశ రాజకీయాల్లో నూతన శకం ఆరంభం కానున్నదని బహిరంగ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ అన్నారు. బహిరంగ సభ జనసమీకరణకు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అమరేందర్ మాట్లాడుతూ.. ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులను తరలించాలని ఆయన పార్టీ నాయకులకు సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, సర్పంచ్‌లు వెంకటరమణ, కుంజా రామారావు, సీనియర్ నాయకులు కందుల కృష్ణార్జున్‌రావు, సత్యనారాయణరెడ్డి, వెంకటరామయ్య, కోర్సా దుర్గారావు, కోరెం రామారావు, పిట్టా శ్రీను, నజీర్‌షోను, రాము, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

చెట్టును ఢీకొట్టిన బైక్

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని సాంబాయిగూడెం గ్రామం వద్ద శనివారం రాత్రి బైక్ చెట్టును ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. పినపాక మండలం పాండురంగాపురం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తమ ద్విచక్రవాహనంపై మణుగూరు నుంచి పాండురంగాపురం వెళ్తున్నారు. అతివేగంగా వెళ్లి సాంబాయిగూడెం చర్చివద్ద చెట్టును ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ఉన్న సోయం చందు (22) అక్కడే మృతిచెందాడు. పూనెం సంతోష్ తీవ్ర గాయాలు కావడంతో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదే యువకులు మణుగూరులోని చిన్న ప్రమాదానికి గురైనట్లు తెలుస్తుంది. ఆక్రమంలోనే అతివేగంగా వెళ్తూ మరోసారి ప్రమాదానికి గురైనట్లుస్తా తెలుస్తోంది. మణుగూరు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలు సేకరించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు.

ఫిబ్రవరి 6 నుంచి లింగమంతుల జాతర

అశ్వాపురం: అశ్వాపురం, మణుగూరు మండలాల సరిహద్దులో ఉన్న రేగులగండి గ్రామంలో ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు జరిగే భవాని లింగమంతుల జాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాతర నిర్వహణ కమిటీ బాధ్యులు, అశ్వాపురం, మణుగూరు మండలాల యాదవ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జగ్గారం గ్రామంలో శనివారం లింగమంతుల జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, అశ్వాపురం, మణుగూరు మండలాల యాదవ సంఘం అధ్యక్షుడు బండారు జనార్దన్, మారుతి శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు లంకెల రమేష్, నక్కనబొయిన పాపారావు, తూము సత్యనారాయణ, తూము వీరరాఘవులు, అశ్వాపురం, మణుగూరు మండలాల యాదవ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

చండ్రుగొండ: సీఎం కేసీఆర్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రం చండ్రుగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వాగులు, చెరువుల ముంపు ప్రాంతాల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేయడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లస్థలం ఉన్న ప్రతి అర్హుడికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ. 5లక్షలు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు కొండపల్లి శ్రీధర్, ఐలూరి రామిరెడ్డి, పెద్దిని వేణు, విప్పర్ల వెంకటేశ్వర్లు,, రాయి రాజా, మిరియాల మోహన్‌రావు, ఆర్ వెంకటాచారి పాల్గొన్నారు.

కనుల పండువగా దివ్య జ్యోతి దర్శనం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని హరిహర క్షేత్రంలో శ్రీ అయ్యప్ప స్వామివారి దివ్య జ్యోతి దర్శనం శనివారం కనుల పండువగా జరిగింది. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణం హరిహర సుతుని నామస్మరణతో మార్మోగింది. మకర సంక్రాతిని పురస్కరించుకుని శబరిమల ఆలయ అనుసారం శ్రీ శివన్ గురుస్వామి ఆశీసులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య జ్యోతిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక బాణసంచా కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకర్షించింది. ఈ కార్యక్రమం ఆలయ అధ్యక్షుడు అడుసుమిల్లి జగదీష్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా 'భోగి' వేడుకలు

- తెల్లవారుజాము నుంచి 'మంటలు'
- కొత్తదుస్తులు, పిండి వంటల హడావిడి
- చిన్నారులకు భోగి పండ్ల ఆశీర్వాదం



అన్నపురెడ్డిపల్లి: శివాలయంలో వేసిన భోగి మంటలు..



అశ్వారావుపేటరూరల్: భోగి ముగ్గు వేస్తున్న మహిళలు



మణుగూరుటౌన్: మంట చుట్టూ చేరిన కాలనీ వాసులు



మణుగూరుటౌన్: పట్టణంలోని ఓ ఇంటి ఎదుట రంగవల్లులు దిద్దుతున్న దృశ్యం



అశ్వారావుపేట: తెల్లవారుజామున భోగి మంట వద్ద స్థానికులు

అశ్వారావుపేట/అశ్వారావుపేటరూరల్: భోగి వేడుకలను మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. తమ ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకున్న భోగి మంటలతో సందడి చేశారు. తెల్లవారుజాము నుంచే భోగి మంటలను సిద్ధం చేసుకొని పనికి రాని పాత సామన్లు, పాత వస్తువులు, చీపుర్లు, పిడికలు సేకరించి మంటల్లో వేశారు. భోగి మంటల ద్వారా వేడి చేసిన నీళ్లతో స్నానాలు చేసి నూతన వస్త్రాలను ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేసుకున్నారు. సాయంత్రం సమయంలో చిన్నారుల తలలపై భోగి పండ్లు వేసి పెద్దలు వారిని దీవించారు.

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలో శనివారం భోగి పండగ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఉదయాన్నే లేచి భోగి మంటలు వేశారు. ఇళ్లలోని చిన్నారులకు భోగిపళ్లు పోసి దీవించారు. కుటుంబసభ్యులు మంగళ స్నానాలు చేసి నూతన వస్త్రాలు అలంకరించారు. మహిళలు రంగవల్లులు దిద్ది గొబ్బెమ్మలు పెట్టారు. పిండి వంటలు చేస్తు కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు.

అన్నపురెడ్డిపల్లి: ఉదయం నుంచే మండలంలోని అన్నపురెడ్డిపల్లి, ఎర్రగుంట, అబ్బుగూడెం, రాజాపురం, పెంట్లం తదితర గ్రామాల్లో ప్రజలు భోగి మంటలు వేశారు. మండల కేంద్రంలోని శ్రీభ్రమారంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో భోగి మంటలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి భోగిపండ్లతో అభిషేకాలు జరిపించారు.

మణుగూరురూరల్: గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు వేకువజామునే నిద్రలేచి భోగి మంటలు వేసుకుని ఆనందంగా సందడి చేశారు. మహిళలు ఇళ్లవాకిళ్లను శుభ్రం చేసుకుని రంగురంగుల రంగవల్లలతో తీర్చిదిద్దారు. అనంతరం ఇంటిల్లిపాది అభ్యంగన స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించారు. అనంతరం పూజామందిరాల్లో దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి దూపదీప నైవేధ్యాలను సమర్పించారు. మరికొంతమంది ప్రజలు సమీప ఆలయాలకు వెళ్లి స్వామివార్లకు, అమ్మవార్లకు పూజలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు.



దమ్మపేట: స్థానికంగా వేసిన భోగి మంట..



మణుగూరుటౌన్: ముగ్గుతో యువతి..

దమ్మపేట: శనివారం తెల్లవారుజామునే గ్రామాల్లో భోగి మంటలను వేశారు. పెద్దలు, పిల్లలు తమ ఇళ్లలోని పనికిరాని, ప్రస్తుతం వాడుకలో లేని వివిధ వస్తువులు, కలపను ఒక చోట పేర్చి, వేసిన భోగి మంటలలో చలి కాచుకున్నారు. అనంతరం తలంటు స్నానాలు చేసి, నూతన వస్త్రాలను ధరించి ఆలయాలకు వెళ్లి తమ ఇష్టదైవాలను దర్శించుకున్నారు. ఇంటిలో చేసిన పిండి వంటలను, విందుభోజనాలను భుజించి కుటుంబ సభ్యులు, బంధువులతో రోజంతా సరదాగా గడిపారు.

కమనీయంగా గోదాదేవి కల్యాణం



భద్రాచలంటౌన్: గోదా కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



చండ్రుగొండ: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

భద్రాచలంటౌన్: ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవి కల్యాణాని కమనీయంగా జరిపారు. పట్టణంలోని సీతారామనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేదపండితులు ఆరుట్ల నారాయణాచార్యుల నేతృత్వంలో జరిగిన కల్యాణోత్సవంలో జక్కం వేణుగోపాలరావు, దుర్గ దంపతులు పాల్గొని కల్యాణం జరిపించారు. అంతకుముందు ఆలయంలో కొలువైన శ్రీనివాసుడికి సుప్రభాత సేవా, పంచామృతాభిషేకాలు, అలంకార సేవలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని తీర్థాప్రసాదాలు స్వీకరించారు.

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని వేణుగోపాలస్వామి ఆలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన పూజారి బోడెం వెంకన్నశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు పూజలు జరిపించారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డుపై పడితే అంతే..!



మండలంలోని పెంట్లం గ్రామ శివారుల్లో అన్నపురెడ్డిపల్లి-ఎర్రగుంట ప్రధాన రహదారిపై ఎండిన వృక్షాలతో ప్రమాదం పొంచి ఉంది. రహదారి పక్కనే భారీ వృక్షాలు పూర్తిగా ఎండిపోయి ఉన్నాయి. గట్టిగా గాలితోలిందంటే ఆ చెట్టు రహదారిపై పడిపోయే అవకాశం ఉంది. ఇటీవల ఖమ్మం జిల్లాలో రహదారిపై ప్రయాణిస్తున్న వారిపై ఎండిన వృక్షం పడి మృత్యువాత పడిన సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకోవాలని, ప్రమాదం జరగక ముందే ఎండిపోయిన వృక్షాలను తొలగించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు. - అన్నపురెడ్డిపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: రమేష్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్ నంబర్: 7780583907

అవార్డుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరుటౌన్: బహుజన సాహిత్య అకాడమీ వారు అందజేసే జాతీయ అవార్డుల ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బహుజన సాహిత్య అకాడమి జిల్లా కమిటీ చైర్మన్ మందడి సంజీవరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ సారథ్యంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన మహాత్మా జోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఏపీజే అబ్దుల్ కలాం, సేవారత్న, సాహిత్య రత్న, నాట్యరత్న, విద్యారత్న, ఉమెన్‌లీడర్‌షిప్ అవార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవార్డులకు ఎంపికై న వారికి 12మార్చి 2023న తిరుపతిలో నిర్వహించే కాన్ఫరెన్స్‌కు సౌత్ ఇండియాలోని 600మంది డెలిగెట్స్‌తో జరిగే ఈసదస్సులో అందజేయడం జరుగుతుందన్నారు. ఆర్హత ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను అందజేయడానికి పూర్తి వివరాలకోసం 9440962670లకు సంప్రదించాలని తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో శనివారం మున్నూరుకాపు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ.. మున్నూరుకాపులందరూ పార్టీలకు అతీతంగా కలిసి మెలిసి ఐక్యతతో ఉండామన్నారు. మున్నూరుకాపుల్లో ఎంబీబీఎస్, ఇంటర్, వివిధ ఉన్నత స్థాయి చదవులు చదివి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు ఆసా శ్రీనివాసరావు, మామిళ్ల నాగభూషణం, ఉపాధ్యక్షుడు కాసరబాద రాములు, కార్యదర్శి కమటం సురేష్, మాజీ ఎంపీపీ ఊసా అనిల్‌కుమార్, ఎంపీటీసీ కమటం నరేష్, పీఏసీఎస్ డైరెక్టర్ కాసరబాద సందీప్, సంఘం నాయకులు, యూత్ సభ్యులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మహిళలు భారీ సంఖ్యలో హజరై పాల్గొన్ని రకరకాల రంగులతో ముగ్గులు వేశారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అపర్ణ, మామిడి పుల్లారావు, ఎండీ బషీర్, సీతామహలక్ష్మి, పరిమి సోమశేఖర్ పాల్గొన్నారు.

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద..

- నేడు సిసలైన పండుగ సంబురాలు
- బంధుమిత్రులతో ఊరూరా సందడి
- టోర్నమెంటులు, కోడిపందేలతో యువత బిజీ



గ్రామాల్లో గంగిరెద్దుల సందడి..



రంగవల్లులతో సంక్రాంతికి స్వాగతం పలుకుతున్న మహిళ

బూర్గంపాడు: పల్లెలన్నీ పండుగ వాతావరణంతో కళకళలాడుతున్నాయి. ఊరూరా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఇప్పటికే భోగి వేడుకలు ముగియగా.. నేడు అసలుసిసలైన పండుగా జరగనుంది. అందులో భాగంగా తెల్లవారుజామునే ఇళ్ల ముంగిట రంగురంగుల రంగవల్లులతో మహిళలు సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలుకుతున్నారు. ముగ్గులు, గొబ్బెమ్మలతో పల్లె ముంగిళ్లు కొత్తశోభను సంతరించుకున్నాయి. చలిని లెక్కచేయక పిల్లలు, పెద్దలు తెల్లవారుజామునే తలస్నానాలు చేసి కొత్తబట్టలు ధరించి సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్నారు. కొత్త అల్లుళ్లతో, బంధు మిత్రులు గ్రామాల్లో సందడి నెలకొంది. చిన్నపిల్లలకు భోగిపండ్లు పోసి ఆశీర్వాచనం తీసుకుంటున్నారు. గంగిరెద్దుల విన్యాసాలతో వీధులలో సందడి నెలకొంది. ప్రతి ఇంట్లో పిండివంటల గుమగుమలతో బంధుమిత్రుల సందడి నెలకొంది.

నవతరం సంక్రాంతి..

గ్రామాల్లో సంక్రాంతి వచ్చిందంటే హరిదాసులు హరినామ స్మరణతో ఉదయాన్నే ఆధ్యాత్మికత చోటు చేసుకుంటుంది. మారుతున్న కాలక్రమంలో హరిదాసులు కనుమరుగయ్యారు. ప్రస్తుతం సంక్రాంతికి గ్రామాల్లో మండల స్థాయి, డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నీలతో యువత బిజీగా ఉంటున్నారు. సంక్రాంతి సెలవుల్లో గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్ టోర్నీల నిర్వహణ ప్రతి ఏటా పెరుగుతోంది. అదే విధంగా మహిళలకు వివిధ సంస్థలు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందిస్తున్నారు. గతంలో కంటే ప్రస్తుతం కోడిపందేలలో పాల్గొనేందుకు, చూసేందుకు యువత ఉత్సాహం చూపుతోంది. తెలంగాణ-ఆంధ్ర సరిహద్దు గ్రామాలలో మూడురోజుల పాటు జరిగే కోడిపందేలకు యువకులు తండోపతండాలుగా తరలివెళ్తున్నారు. కొందరు పందెం కోళ్లతో పోటీలలో పాల్గొంటే, మరికొందరు వాటిని చూస్తు బెట్టింగ్‌లు పెట్టుకుంటున్నారు. గ్రామాల్లో సంక్రాంతి పండుగకు కొత్తబట్టలు, పిండి వంటలకు అయ్యే ఖర్చుకు పదింతలు కోడిపందేలకు ఖర్చు చేస్తున్నారు.

హోరాహోరీగా 'యూసుఫ్' టోర్నీ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందిస్తున్న నిర్వాహక ప్రతినిధులు

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 15వ యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. శనివారం జరిగిన తొలిమ్యాచ్‌లో లక్ష్మీపురం సంతోష్ ఎలెవన్ జట్టుపై బూర్గంపాడు గియాన్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో మణుగూరుఫ్రెండ్స్ ఎలెవన్ జట్టుపై కొత్తగూడెం పండు స్ట్రయికర్ జట్టు గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో పాల్వంచ స్పైడర్ ఎలెవన్ జట్టుపై పాల్వంచ లయన్స్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. నాల్గో మ్యాచ్‌లో కుక్కునూరు అక్బర్ ఎలెవన్ జట్టుపై భద్రాచలం బ్లాక్యాప్స్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. ప్రతి మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను నిర్వాహకులు అందజేశారు.

పందెంకోడి సిద్ధం..



కోడి పందెలను వీక్షిస్తున్న యువత (ఫైల్)

- సరిహద్దు ప్రాంతాల్లో జోరుగా బిర్రులు
- భారీ స్థాయిలో క్యూ కడుతున్న జనం
- ఫలించని పోలీసుల ఎత్తులు



సరిహద్దు గ్రామాల్లో కొనసాగుతున్న కోడిపందేలు (ఫైల్)

బూర్గంపాడు: తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లో సంక్రాంతి సందడి షురూ అయింది. రెండు రాష్ట్రాల సరిహద్దు గ్రామాలు కోడి పందేలకు అడ్డాగా మారాయి. యువత కోడిపందేల బిరులలో పందెం కోళ్లతో హల్‌చల్ చేస్తున్నారు. పోలీసుల కన్నుగప్పి కొన్నిచోట్ల, పోలీసులతో లోపాయికారీ ఒప్పందాలతో మరికొన్నిచోట్ల కోడిపందేలు జోరందుకున్నాయి. తెలంగాణ-ఆంధ్ర సరిహద్దు గ్రామాల్లో రైతులు, యువత మధ్య స్నేహసంబంధాలు కొనసాగుతుండటంతో సంక్రాంతి సందడి మరింత ఉత్సాహాన్ని నింపుతోంది.

బూర్గంపాడుకు సమీపంలోని వేలేరు, కుక్కునూరు ప్రాంతాల్లో పందెంకోళ్ల సందడి చేస్తున్నాయి. అదే విధంగా తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు గ్రామమైన మారాయిగూడెంలో కోడిపందేలు జోరుగా సాగుతున్నాయి. రెండు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లోని తోటల్లో, మారుమూల ప్రాంతాల్లో కోడిపందేలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశారు. అనధికారిక ఒప్పందాలతో నిర్వాహకులు పందెంరాయుళ్లను ఆకర్షిస్తున్నారు. భారీగా ఆదాయం సమకూర్చుకునేందుకు నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా యువతను టార్గెట్ చేసి కోడిపందేలాకు ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే క్రికెట్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లతో ఈజీ మనీకి అలవాటు పడిన యువత కోడిపందేలాపై ఆసక్తి కనబరుస్తున్నారు. పండుగ మూడు రోజులు కొందరు యువకులు పూర్తిగా కోడిపందేలపైనే దృష్టి సారిస్తున్నారు.

పలు ప్రాంతాల నుంచి రాక..

రాష్ట్ర సరిహద్దు గ్రామాలలో జరుగుతున్న కోడిపందేలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటుగా ఖమ్మం, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన యువకులు కూడా కార్లలో, బైకులపై వస్తున్నారు. సంక్రాంతికి హైదరాబాద్, బెంగుళూరు తదితర ప్రాంతాల నుంచి ఇళ్లకు వచ్చిన వారు కూడా కోడిపందేలను వీక్షించేందుకు సరిహద్దు గ్రామాలకు క్యూ కడుతున్నారు. యువకులతో పాటుగా రైతులు, కూలీలు కూడా సరదాగా వీక్షించేందుకు పాల్గొంటున్నారు. అయా ప్రాంతాలలో పోలీసులు నిఘా ఏర్పాటు చేసినప్పటికీ దొడ్డిదారుల్లో పందెంరాయుళ్లు కోడిపందేలకు వెళ్తున్నారు. సంక్రాంతి మూడురోజులు కోడిపందేలలో లక్షల రూపాయలు చేతులు మారే అవకాశాలు కన్పిస్తున్నాయి. కోడిపందేలతో పాటుగా పేకాట కూడా జోరుగా సాగుతుంది.